క థా ని క

# గుండె బలం

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

సుదర్శనం తాను చేస్తున్న ఉద్యోగ ప్రయత్నాలు ఇంత వేగంగా ఫలప్రదం అవుతాయని ఆశించలేదు. ప్రతి పేపర్లోనూ వాంటెడ్ కాలమ్స్ చూసి జవాబులు రాస్తూనే ఉన్నాడు. చాలా చోట్లనించి జవాబులే రాలేదు. వచ్చిన జవాబులు చాలావరకూ నిరుత్సాహంగానే ఉన్నాయి. ఒక కంపెనీవాళ్లు ఢిల్లీ స్వంత ఖర్చులతో అతన్ని ఇంటర్వ్యూకి రమ్మన్నారు ఇంకొకరు పూనా రమ్మన్నారు. అపాటి పెట్టుబడి ఉంటే అతను ఏ వ్యాపారమో చేసుకునే ఉండును.

ఈమధ్య ఏదో కంపెనీవాళ్ళు టైపు నేర్చుకున్న గుమాస్తా కావాలని ఒక ప్రకటన వేశారు. సుదర్శనం అప్లయి చేశాడు. నాలుగో రోజుకి వాళ్లు మదరాసు ఇంటర్వ్యూకి రమ్మనీ ఖర్చులు తామిస్తామనీ రాశారు. ఇంకేం? ఉద్యోగం మాట ఎలాగ ఉన్నా మదరాసైనా ఒకసారి చూడొచ్చునుగదా అని ప్రయాణానికన్నీ సిద్ధం చేసుకున్నాడు.

కాని ఇంటర్వ్యూ అంటేమాత్రం సుదర్శనానికి అనుమానంగానే ఉన్నది. ఏ ప్రశ్నలు వేస్తారో, ఏమి టడుగుతారోనని. స్వతహాగా అతను చాలా ధైర్యం ఉన్నవాడే. ఆ మధ్య మంత్రిగారు వస్తే, నిరుద్యోగులకి ఉద్యోగం కల్పించడం విషయమై ఒక డెప్యుటేషన్ తీసికెళ్ళాడు. సభల్లోనూ మాట్లాడుతూంటాడు. కాని, ఇంటర్వ్యూకి చాలా విషయాలు తెలుసుకుని ఉండాలాయె! వాళ్లు వేసే ప్రశ్నలూ అలాగే ఉంటాయి. ఆ మధ్య ఒక పెద్ద ఉద్యోగానికి వచ్చినవాళ్ళందరినీ, ఒక గదిలోకి తీసుకెళ్లి అక్కడి ఒక కుక్క బొమ్మని చూపించి "ఇదేమిటి?" అన్నాడట. "అది కుక్క" అన్నారట అంతాను. వాళ్ళందరినీ యింటికి దయచెయ్యమన్నాడట ఆఫీసరు. చివర కొక బుద్ధిమంతుడు వచ్చి, "అది కుక్క బొమ్మ" అన్నాడట. దానితో ఆఫీసరు మెచ్చుకుని, అతని కుద్యోగం ఇచ్చేశాడట.

సుదర్శనం ఇలాంటివి చాలా చదివేడు. అలాటివేవైనా అడిగితే దంచేస్తాను అనుకున్నాడు. కాని, ఏమైనా తెలియని వడిగితే?

ఇంటర్వ్యూకి ఇంకా వారం రోజుల టైమ్ ఉన్నది. సుదర్శనం లైబ్రరీకి వెళ్లి అర డజన్ పుస్తకాలు తెచ్చాడు. వివిధ విషయాలు గురించి ఉన్నవి. అందులో తాను చేరబోయే కంపెనీ ఏదో బేంకర్సది. అంచేత బేంకింగ్ మీద కూడా ఒక పుస్తకం తెచ్చాడు.

అవన్నీ పట్టుకొచ్చి గదిలో కూర్చుని చదవడం మొదలుపెట్టాడు. కాని, శశిరేఖ అతన్ని బతకనివ్వలేదు. అందుకే, మేనమామ కూతుర్ని పెళ్ళాడడం ప్రమాదం అని అతను చెపుతూంటేవాడు. కాఫీ ఇచ్చే మిషతో అతని గదిలోకి వచ్చి "ఏమండీ, ఇంటర్వ్యూకి సిద్ధపడుతున్నారా?" అంది.

"సిద్ధపడడానికి నాకేమున్నా ఇంటర్వ్యూ భయం ఉందనుకున్నావా?" అన్నాడు సుదర్శనం. ఉన్న విషయం—భార్యదగ్గరైతేమాత్రం—ఎందు కంగీకరిస్తారు?

"మరైతే, ఈ పుస్తకాలన్నీ ఎందుకు తెచ్చారు?" అంది శశి.

"కాలక్షేపం కోసం" అని మాత్రం అని, అతను కాఫీ ముగించి ఆమె చేతికి ఇచ్చేశాడు గ్లాసు-ఇంక వెళ్ళమన్నట్లు.

కాని శశి, అలాగ వదిలిపెడుతుందా? ఆమే కాస్త చదువుకున్నదాయె. అందుకని "ఎంత చదివినా, గుండె ధైర్యం ఉంటేనే కాని ఇంటర్వ్యూలలో విజయం రాదని మా తాతగారు చెప్తూంటేవారు" అంది.

శశి తాతగారు పెద్ద ఉద్యోగం చేసి రిటైర్

ఆయిన మనిషి. ఆయన చచ్చిపోయాడుగాని, లేకపోతే ఆయనదగ్గరకి వెళ్లి సుదర్శనం సలహా తీసుకుని ఉండును. అయినా, సుదర్శనానికి ఆత్మవిశ్వాసం-అదే, గుండెబలం చాలా ఎక్కువ. అతనికీ ఆ విషయం తెల్సును.

"ఐతే, నాకు గుండె బలం లేదంటావు?" అన్నాడు కొంచెం కోపంగా.

అది గ్రహించి చిన్న నవ్వుతో, "అహాఁ, అలాగ యెందుకంటాను? అయినా అవసరం వచ్చేసరికి ఇలాంటి శక్తులు అక్కరకు రావని." అంది.

"నువ్వలా అంటావా? ఈసారి చూసుకో నా శక్తి ఇంటర్వ్యూ ఎలాటి వాడితోనైనా సరే, ధీమాగా మాట్లాడి ఆర్డర్స్ తీసుకునే వస్తాను" అన్నాడు అతను.

"సరే. చూద్దాంగా ఇంక వారంలో అన్నీ తేలుతై" అని, శశి వెళ్ళిపోయింది.

ఆ వారమూ సుదర్శనం చాలాకష్టపడి చదివాడు. బ్యాంకు లెన్నిరకాలో, అవి చేసే పనులేమిటో దేశాలో ఉన్న బ్యాంకులెన్నో, బ్యాంక్ రేట్ మొదలైన పారిభాషిక పదాలకి అర్థం ఏమిటో, అతను చాలా బాగా నేర్చుకున్నాడు.

ఇంక మదరాసు బయలుదేరడమే తరవాయి. మంచిరోజు — తారాబలం, చంద్రబలం, తిథి, వారం, నక్షత్రం-అన్నీ బాగున్నరోజు చూసి ముహూర్తం నిర్ణయించేశాడు. ఇంతా చేస్తే అతనికి మదరాసు రెండుగంటలు ప్రయాణం.

శకునమూ అదీ చూసుకుని, సుదర్శనం బయలుదేరాడు. తులసమ్మకీ, రాములవారికీ నమస్కరించి, పూజాకుంకుమ నొసట ఉంచుకుని, తల్లిదండ్రులదగ్గర సెలవుతీసుకుని, "వెళ్ళివస్తాను శశీ" అన్నాడు.

"వెళ్ళిరండి. కాస్త ధైర్యం మాత్రం..." అని హెచ్చరించి, నవ్వుతూ సాగనంపింది శశిరేఖ.

ఆ స్టేషన్కి ఉదయం తొమ్మిదికి వస్తుంది మెయిలు. అతని అదృష్టవశాత్తూ ఆనాడు ఉదయం సరిగ్గానే వచ్చింది. కాని, మూడో తరగతి పెట్టెలన్నీ విపరీతంగా క్రిక్కిరిసి ఉన్నాయి. వేసుకున్న సూటు నలిగిపోతే కష్టం కనక, అతను ఇంటర్ క్లాసులో ఎక్కుదామని, తొందరగా ఒక కంపార్ట్మెంటు దగ్గరకి వెళ్ళాడు.

రైలు కూతవేసి, బయలుదేరడానికి సిద్ధంగా ఉంది. ఆ కంపార్ట్మెంటు తలుపుదగ్గర ఎవరో స్థూలంగా, చింతమొద్దల్లే నిలుచబడి ఉన్నాడు. "కొంచెం లోపలికి జరగండి. లోనికి రావాలి" అన్నాడు సుదర్శనం ఆత్రుతతో.

నువ్వెవడోయ్? అన్నట్లు ఒక చూపు చూసి ఆ మనిషి అలాగే నిలబడ్డాడు.

రైలు కదిలిపోతోంది. సుదర్శనం చేతి సంచీతో సహా ఒక్కసారి తలుపుతోసుకుని లోపలపడ్డాడు. తలుపు వెనక్కి తోసుకుని, "ఆఁ" అంటూ ఆ చింతమొద్దుమనిషి దానికీ గోడకీ మధ్యన పడ్డాడు

సుదర్శనం మొదట కొంచెం భయపడ్డాడు. కాని, జంకితే లాభంలేదని, అతను సర్దుకుని నోరొత్తేలోపునే, "ఇంకెప్పుడూ గుమ్మందగ్గర నిలబడి లోనికి వచ్చేవాళ్ళని అడ్డే ఉద్యోగం తీసుకోకు" అన్నాడు కళ్ళెగ్రజేసి.

ఆమనిషి చాలా అమాయకుడల్లే వున్నాడు. వెళ్లి తన జాగాలో కూర్చున్నాడు. తన విజయానికి చాలా సంతోషిస్తూ సుదర్శనం అతనికి ఎదురుగా కాస్త జాగా చేసుకుని కూర్చున్నాడు. గుండె ధైర్యం తనకుందని ఈ క్షణములో శశి ఇక్కడ ఉంటే తెలుసుకునివుండు ననుకున్నాడు.

మరికొన్ని నిముషాలలో ఇంకో కొత్తఅల్లరి వచ్చింది. ఆ చింత మొద్దాయన కొరివల్లే ఒక చుట్టతీసి ముట్టించాడు. ఆ బెంచీమీదా, ఎదురుగానూ ఆడవాళ్ళు అయిదారుగురు కూర్చున్నారు. వాళ్లు పాపం ఆ పొగ పడక నానా బాధా పడుతున్నారు. అందరూ అతనివైపు కోపంగా చూస్తున్నారు. ఎవరూ అతన్ని చుట్ట కాల్చవద్దని చెప్పలేకుండా ఉన్నారు.

ఇదంతా చూస్తూన్న సుదర్శనానికి కోపం ఆగలేదు. మొదట "మనకెందుకూ? వాళ్ళే పోతా"రని ఊరుకోబోయాడు కాని, ఆ వాసన తనదాకా కూడా వచ్చేసరికి ఇంక సహించలేక ఆయనవైపు తిరిగి, "మీరు చుట్ట కాల్చడం మానెయ్యడం చాలా అవసరం" అన్నాడు.

ఆ మనిషి ఏమీ కదలలేదు. నల్లని వలయాల్లో చుట్టపొగని అలాగ వదిలిపెడుతూనే ఉన్నాడు.

"మీకే చెప్పేది. కంపార్ట్‌మెంటులో చుట్టలు కాల్చడం వీలులేని పని పోనీ, ఆడవాళ్లు బాధపడుతున్నారనైనా మీకు తోచలేదు. చుట్ట పారవెయ్యండి" అన్నాడు. అందరూ అతని వైపు ఆశగా చూశారు

దానికి జవాబుగా కాబోలును ఆ వ్యక్తి వికారంగా ఒక నవ్వు నవ్వాడు.

సుదర్శనానికిది చాలా అవమానకరంగా తోచింది. అంతమంది మధ్య-ముఖ్యంగా ఆడవాళ్లమధ్య-తప్పుచేస్తూన్న ఆ వ్యక్తి తననొక గడ్డిపోచగా చూడడం అతనికోపాన్ని హెచ్చించింది. అందరూ అప్పుడే తన వైపు నవ్వుతోన్నట్లు చూస్తున్నారు.

స్వరం రెట్టించి సుదర్శనం, "చుట్ట తీస్తారా, లేదా?" అన్నాడు.

ఆ వ్యక్తి మళ్ళా ఆ వికారమైన నవ్వు నవ్వాడు.

సుదర్శనానికి గౌరవం దక్కించుకోడానికి ఒక్కటే పద్ధతి కనిపించింది. ఆ వ్యక్తి నోట్లో ఉన్న చుట్టని చేత్తో లాగి, బైట గిరవాటు వేశాడు. అందరూ నవ్వారు.

సూటు వేసుకున్న ఆ వ్యక్తి ఈ అవమానాన్ని సహించడని సుదర్శనం సంసిద్ధుడయే ఉన్నాడు. కాని మళ్ళీ వికారంగా ఇంకో నవ్వు మాత్రమే నవ్వి అతనూరుకున్నాడు. అనేక ఆలోచనలతో సుదర్శనం ప్రయాణం సాగిస్తున్నాడు రాబోయే ఇంటర్వ్యూ గురించి అతను కలలు కంటున్నాడు.

ఇంతలో టికెట్ కలెక్టరు వచ్చాడు. అందరి దగ్గరా టిక్కెట్లు చూసి, సుదర్శనాన్ని ఎక్సెస్ ఇచ్చుకోమన్నాడు, ఆ వ్యక్తినిమాత్రం అతను టిక్కెట్టు అడగనేలేదు.

ఒక్కసారి సుదర్శనానికి తట్టింది - అతను ఎవరో పెద్ద ఉద్యోగస్థుడు-శాంతం వల్లనే తన ప్రవర్తన సహించాడేమోనని. గుండెజల్లుమంది.

పదకొండయేసరికి మదరాసులో దిగాడు సుదర్శనం. ఆ వ్యక్తి కూడా అతనితోనే సెంట్రల్ స్టేషన్‌లోనే దిగాడు. ఇంటర్వ్యూకి ఇంక గంటమాత్రం టైం ఉంది.

సుదర్శనం ఒక హోటల్లో కాఫీ తాగి, బట్టలు సర్దుకుని, పదకొండున్నర అయేసరికి ఇంటర్వ్యూకి రమ్మన్న అడ్రస్‌కి బయలుదేరాడు.

ఆ ఎడ్రస్‌గల ఇల్లు చిన్న బంగళా. చుట్టూ చక్కని తోటా అదీ ఉంది. వెళ్ళి అక్కడి జవానుని, ఫలానా అడ్రస్ ఇదేనా? అని అడిగాడు.

అతను ఇంటర్వ్యూకి వచ్చాడని తెల్సుకుని ఆ జవాను అతన్ని కూర్చోబెట్టి అతని చిరునామా కాగితం లోనికి పట్టికెళ్ళి ఇచ్చాడు.

మరో అయిదు నిముషాలకతనికి పిలుపు వచ్చింది. ఒక్కసారి భగవంతుణ్ణి స్మరించుకుని అతను లోపలికి వెళ్ళాడు.

గుమ్మందాటగానే అతను అక్కడి గదిలో కుర్చీలో ఉన్న పెద్దమనిషిని చూసి తెల్లబోయాడు. అతని శరీరం కంపమెత్తింది. గొంతుక తడి ఆరిపోయింది. తనతో రైలుప్రయాణం చేసిన ఆ చింతమొద్దు పెద్దమనిషి, మారిన బట్టలలో అక్కడ కూర్చున్నాడు.

ఉద్యోగం వచ్చేయోగం ఎలాగా లేక పోయాక ఇంక ప్రతిమాటే ఉపయోగం కనపడలేదు సుదర్శనానికి. "గుడ్ మార్నింగ్ సర్" అన్నాడు చాలా ప్రయత్నించి-జంకకుండా.

కుర్చీలో కూర్చున్నాయన "గుడ్ మార్నింగ్" అని జవాబిచ్చి చిన్ననవ్వునవ్వాడు రైల్లో అతను నవ్వినన వ్వే! పడబోయే పిడుగులకోసం సుదర్శనం కాచుక్కూర్చున్నాడు. ఆ క్షణంలో ఒక్కసారి శశి హెచ్చరికమాత్రం జ్ఞప్తికివచ్చింది. ఏమో! తన ధైర్యసాహసాలూ, ఆత్మవిశ్వాసమూ చూసి మెచ్చుకుని ఆ ఉద్యోగం అతను తనకే ఇస్తాడేమో!

ఎదురుగా కూర్చున్న బ్యాంక్ మేనేజరు సుదర్శనాన్ని చూస్తూ, "స్కూల్ ఫైనల్ ఎప్పుడు ప్యాసయ్యారు?" అన్నాడు.

చెప్పాడు అన్నాడు సుదర్శనం.

"టైప్ రైటింగ్ హయ్యరో?" అని అడిగాడు మ్యానేజరు.

"మొన్న మార్చిలో"

"సరే, ఈ కాగితానికి నాలుగు కాపీలు తీస్తారా? ఒరిజినల్ కాగితానికి ఒకవేపూ, కాపీలు రెండువైపులానూ."

కాగితాలు తీసుకుని, సాధ్యమైనంత మనో ధైర్యంతో మెషీన్ ముందు కూర్చున్నాడు సుదర్శనం. కొద్దినిముషాలలో సూచనల ప్రకారం పనిపూర్తిచేసి మేనేజరు ముందుంచాడు.

మేనేజరు సంతృప్తిగా ఆ వికారపునవ్వే ఒక సారి నవ్వి, "పనిలో ఎప్పుడు జాయిన్ అవగల రు?" అన్నాడు.

తన చెవులని తానే నమ్మలేకపోయాడు సుదర్శనం. "మీ ఇష్టం. నేను సిద్ధమే"నన్నాడు.

"జీతం నూరు; క్వార్టర్సు ఇస్తాము. సమ్మత మేనా?" అన్నాడు మేనేజరు.

"సమ్మతమే"నన్నాడు సుదర్శనం. మేనే జరుని లోలోపల చాలా మెచ్చుకున్నాడు.

"అయితే, ఎల్లుండి జాయిన్ కండి. మీ క్వార్టర్సు చూపుతాను. మా క్వార్టర్సు ప్రక్కనే. ఇదుగో-ఆర్డరు ఆరు కాపీలు టైప్ చెయ్యండి" అని ఆర్డరు రాసి ఇచ్చాడు. ఆ పనీ ముగించి, క్వార్టర్సు చూసుకుని, మహా సంతోషంతో రాత్రికి ఇంటికి తిరిగివచ్చాడు.

"ఏమైందండీ?" అంది శశి, అతను గుమ్మం ఎక్కగానే ఆత్రుతతో.

"ఏమవడం ఏమిటి? ఎల్లుండి జాయిన్ అవాలి. నూరు జీతం, ఫ్రీ క్వార్టర్సు"

అందరూ చాలా సంతోషించారు. ఆ రాత్రి శశి అడిగింది "ఇంటర్వ్యూలో ఏం అడిగారు? చదివిన వేమైనా అడిగారా?" అని.

"అసలు ప్రశ్నిస్తేగా? నా గుండెబలం, ధైర్యసాహసాలూ అతనికి రైల్లో చూపెట్టేను. ఇంక తిరుగు లేకుండా ఆర్డర్ ఇచ్చాడు" అని రైలులో జరిగిన ఉదంతం అంతా పూసగుచ్చి నట్లు చెప్పాడు.

అనుకున్నట్లు మూడోరోజున శశితో సహా మదరాసు వెళ్ళి, క్వార్టర్సులో దిగి, పనిలో చేరాడు సుదర్శనం. సాధ్యమైనన్నిసార్లు తన గొప్పతనం ఆమెకి జ్ఞప్తిచేస్తూనే ఉన్నాడు-అలాగ ఆమె తనకి భయపడేలాగ చేసుకోవ డానికి.

తొలి రెండురోజులూ అయాక ఒకనాడు రాత్రి భోజనం చేస్తూంటే శశి, "మీ గుండె బలం మాట దేవు డెరుగును-ఎప్పుడూ మీ మేనే జరు ఇంటికిమాత్రం పోకండేం" అంది.

అతను ఆశ్చర్యంగా, "ఏం" అన్నాడు.

శశి సమాధానం చెప్పలేక నవ్వుతోంది. ఏదో విశేషం ఉందని గ్రహించి, "అసలు సంగతి చెప్పవేం?" అన్నాడు రెట్టించి.

కొంచెం సముదాయించుకుని, "మీరు రైల్లో ధీరత్వం చూపారే, ఆయన మీ మేనేజరు కాదు" అంది శశి.

సుదర్శనం మొదట తెల్లబోయి తరువాత నిశ్చయంగా, "అది శుద్ధ అబద్ధం. నాకు కళ్ళు లేవనుకున్నావా?" అన్నాడు

"అది కాదండీ నేను నిజమే చెప్తున్నాను. ఇవాళ మీ మేనేజరుగారి అమ్మాయి పిలిస్తే వాళ్ళ ఇంటికి వెళ్ళాను" మళ్ళీ నవ్వుతోంది శశి.

"నీకు తెలియకపోతే ఊరుకో. మా మేనే జరుని లక్షమందిలో గుర్తించవచ్చును. నువ్వే నా గొప్పతనం సహించలేక అబద్ధం ఆడు తున్నావు" అన్నాడు సుదర్శనం.

"అదేం కాదండీ. మీ మానేజరూ, ఆ రైల్లో ఆయనా కవల పిల్లలు. ఆ వేళే ఆయన వాల్తేరు నించి వస్తున్నారట. ఇవాళ మాటల సంద ర్భంలో వాళ్ల అమ్మాయి చెప్పింది. అతనికి మూగ—దానికి తోడు మెదడు సరిగా లేదట. ఇంక లాభంలేదని వాల్తేరునించి పంపేశారట" అని బోధపరచింది శశి.

సుదర్శనం నమ్మక తప్పింది కాదు. కొంచెం ఆలోచించి, "ఐతే, టికెటు కలెక్టర్ అతన్ని టిక్కెట్ అడగలే దెందుచేతనంటావ్?"

"సరే-అదీ నేనే చెప్పాలీ? ఏ బెజవాడ దగ్గరో, టికెట్ కలెక్టర్ ఆ కంపార్ట్మెంటు లోకి ఎక్కివుంటాడు. అప్పుడతని టికెట్ చెక్ చేసి ఉంటాడు. ముఖంగుర్తుపట్టి మళ్ళీ అడగడం మానేసి ఉంటాడు"

సుదర్శనం ఇంక వాదించలేదు.

"ఏమంటారండీ?" అంది శశి, విజయ గర్వంతో.

అతనుజవాబివ్వలేదు. మూగమనిషి స్థానంలో మేనేజర్ ఉండి ఉంటే తన ప్రస్తుత పరిస్థితి ఏమై ఉండునని అతను లెక్క వేసుకుంటు న్నాడు.